

# స్పర్ధ

## గోపీచంద్

వీరయ్య కొడుకు కోటయ్య వీళ్ళిద్దరికీ స్పర్ధరావటం ఊళ్లో అందరికీ ఆశ్చర్యంగానే వుంది. చాలాకాలం వరకూ తండ్రీ కొడుకులు చాలా అన్యోన్యంగా వుండేవారు. అన్యోన్యము అంటే తండ్రి చెప్పినట్టు కొడుకు వినేవాడు ఇప్పుడా పరిస్థితి మారింది—ఈ మధ్య వీరయ్య భార్య చనిపోవటం, అతడు మళ్ళీ పెళ్ళి చేసుకోవటం జరిగింది. అంతకు ముందే కోటయ్య పెళ్ళి అయింది అప్పటినుంచీ తండ్రీకొడుకుల మధ్య స్పర్ధ పెరిగింది. ఉన్న పూరిగుడిసె చెరిసగం చేసుకొన్నారు. చెరొక ఏభై రూపాయిలూ పంచుకున్నారు. తన యాభై రూపాయిలూ పెట్టి వీరయ్య వెంటనే ఒక గేదెను కొన్నాడు. అతని భార్యపాలూ, పెరుగూ అమ్మటం మొదలుపెట్టింది. అది చూచి సహించలేక, కోటయ్య భార్య పోరిపోరి భర్తతో తమకొక గేదెను కొనిపించింది. అప్పటినుంచి మరీ స్పర్ధ ఎక్కువైంది. మేత వెయ్యటం మొదలుకొని, పాలు అమ్ముకొనటంవరకూ రోజూ తగాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆనాడు అయిదు గంటలకు లేచి గేదెకు మేతవెయ్యటానికి దొడ్లోకి వెళ్ళాడు కోటయ్య. తమ గేదెకంటె మామగారి గేదె ఎక్కువ పాలిస్తూ వుందనీ, తమ గేదెకు పోషణ సరిగ్గా జరగటంలేదనీ, భార్య పోరితే కోటయ్య అప్పటినుంచి గేదెకు తనే మేత

వెయ్యటం, కుడితిపెట్టటం చేస్తున్నాడు. గేదెకు జనపకట్ట వేద్దామని వామి దగ్గరకు వెళ్ళాడు. దాని ప్రక్కనే తన తండ్రి వామి వుంది. తండ్రి వామిని చూచేటప్పటికి అతనికొక దురాలోచన కలిగింది. తన తండ్రి మంచి జనపకట్టలు పోగుజేశాడు. తన గేదెకు ఆ జనపకట్ట వేస్తే—యీ ఆలోచన తట్టీ తట్టటంతోనే అతి భయంకరంగా కనిపించింది కోటయ్యకి. నెమ్మదిగా అలవాటయినది. తన తండ్రి వామిదగ్గరకు వెళ్ళాడు. ఒక జనపకట్ట లాగాడు. రెండడుగులు వేశాడు. ఎదురుగా తండ్రి కనిపించాడు. ఎందుకనో ఆ జనపకట్టతో తండ్రిని బాదుదామనిపించింది. జనపకట్ట చేత్తో పట్టుకొని రోషంగా చూశాడు. వీరయ్య ఏమనుకున్నాడో! అక్కడి నుంచి నెమ్మదిగా వెళ్ళిపోయాడు. గబగబా జనపకట్ట గేదెముందు దులిపి గుడిసెలోకి వచ్చి పడుకున్నాడు కోటయ్య

తెల్లవారేటప్పటికి ఈ సంగతి ఎట్లా తెలిసిందో వీరయ్య భార్యకు తెలిసింది. వీరయ్య యింట్లోలేడు, వీరయ్య భార్య ఈ సంగతి తెలిసీ తెలియటంతోనే దొడ్డిలోకి వెళ్ళి కోటయ్య వామిలోనుంచి నాలుగుకట్టలు లాగి తన గేదెకు వేసుకుంది. ఈ సంగతి కోటయ్య భార్యకు తెలిసి తగాదా పెట్టుకుంది.

"నీ చెయ్యి విరగా——"

"నీ మొగుడెందుకు చేశాడే?"

"నా మొగుడు చేశాడా?"

"మా జనపకట్ట లాగి--"

"రుజువు చెయ్యి"

వీరయ్య భార్య ప్రక్కగుడిసెలో కాపురం వుంటున్న రత్తయ్యని పిలిచి రుజువుచేసింది. అంతా చెప్పి, "రత్తయ్య మామకూడా చూశాడు" అని చెప్పింది. అక్కడితో మరీ రేగింది కోటయ్య భార్య. మమ్మల్ని ఇంట్లో వుండకుండా చెయ్యడానికికాని ఈ పన్నాగం పన్నావన్నది. వాడకట్టువాళ్ళందర్నీ కూడ కట్టుకుంటున్నావన్నది. అంతా నీ పక్షం పలక్క, దిక్కులేని పక్షిని నా పక్షం ఎవరు పలుకుతారన్నగి నాకేమి—అండా దండా అన్నది. అక్కడితో వీరయ్య భార్య వేసుకుంది. మళ్ళీ జుట్టూ జుట్టూ వేసుకున్నారు. వాడకట్టంతా పోగైంది. ఎవ్వరికి చెప్పేవి వారికిచెప్పి అప్పటికి సర్దారు.

కోటయ్య భార్యకు కోపం ఆగలేదు. ఇంట్లోకివచ్చి మొగుడిమీదకు రేగింది. 'దీనికంతకూ నీ మెత్తదనమే కారణం' అని బిగ్గరగా ఏడ్చింది. దొంగతనాలు కట్టినా రంకుతనాలు కట్టినా నీకు పట్టనట్టు కూర్చుంటావు. ఒక్క ఆడదాన్ని నావల్ల ఏమవుతుంది? అని ఏడ్చింది. కాని కోటయ్య 'కిం' అనిలేదు. 'కమ్' అనలేదు. తలనిండా ముసుగుపెట్టుకొని పడుకున్నాడు. పడుకున్నట్టే వున్నాడు

వీరయ్య ఎక్కడెక్కడ తిరిగాడో సాయంకాలం ఇంటికి వొచ్చాడు. వొచ్చీ రావటంతోనే సంగతంతా పసికట్టాడు. కోటయ్య భార్య అతనికి వినబడేటట్లు తిట్లు ప్రారంభించింది. ఆ తిట్లు విని వీరయ్య భార్య జుయ్యిన లేచింది తోకతొక్కిన పాముల్లే. ఇద్దరూ మళ్ళీ లడాయి వేసుకున్నారు. పాతపాటే అయినా మళ్లీ వాడకట్టంతా చుట్టుముట్టింది. వీరయ్యకు కోపం వచ్చింది. "నోరుమూసుకు లోపలకు వెళ్ళు" అని గదమాయించాడు భార్యని.

"దొంగతనం చేస్తుంటే!" అని అరచింది.

"ఎవరు దొంగతనం చేసింది?"

"నీ కొడుకు."

"ఎవరు చెప్పారు?"

"నువ్వు చెప్పకపోతే దాగుతుందనుకున్నావా?" అన్నది భార్య.

"ఎవరు చెప్పారు?"

"రత్తయ్య."

"వాడిమాట ఎందుకు నమ్మావ్?"

"ఒకరు చెప్పేదేమిటి. ఇంతంత ఆకు వాళ్ళకాడ ఎక్కడిదీ?" అని కోటయ్య గేదె ముందున్న జనపకాడ చూపించింది.

"వెళుతూ నేనే మన జనపకట్ట ఒకటి వేసి వెళ్లాను. దీనికింత గోలేమిటి" అన్నాడు వీరయ్య.

"చూచారా, చూచారా ... ఎంత పన్నాగం పన్నిందో...ఈ గుడిసెలో, మేముండటం ఇష్టంలేక ఇదొకటి వేయించింది—" అని అక్కడ పోగయిన వారందరికీ యదార్థాన్ని తెలియజెప్పింది కోటయ్య భార్య...చెప్పి మొగుడు దగ్గరకు పరుగెత్తింది.

"చూశారా!" అన్నది. ముసుగు పెట్టుకొని పడుకున్న కోటయ్య మాటాడలేదు.

"మీ నాన్న వొచ్చాడు. వున్నది వున్నట్టు చెప్పాడు" అన్నది.

"ఏం చెప్పాడు?" అంటూ మంచం మీదనుంచి ఉలికిపడి లేచాడు కోటయ్య.

"మన గేదెకు తన జనపకట్ట తనే వేసి వెళ్లాడట" అన్నది భార్య.

ఈ మాట వినగానే కోటయ్య మళ్ళీ గబుక్కున ముసుగుపెట్టుకుని పడుకున్నాడు. భార్య చిలవలు, పలవలు చేసి చెబుతూనేవుంది. అత్తను తిడుతూనే వుంది. అతనుమాత్రం వేసిన ముసుగు తియ్యలేదు.

